# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA


ప్రతి అక్షరం.. ప్రజల పక్షం   జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 11 | శనివారం | 8-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:11 | Saturday | 8-8-2026 | Pages:08 | Cost:2/- |









# బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం..

- బీసీల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- ఇప్పటికే చట్టం ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల
- ఆర్థిక కష్టాలున్నా అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడబోమని చంద్రబాబు స్పష్టం

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా

- మిగతా 2వ పేజీలో



# మీరు చేస్తారా.. మేము ఎంటర్ కావాలా?

- మొత్తం కంట్రోల్‌లోకి తీసుకుంటాం... కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాల్సిందే
- మీ జిల్లాల పరిధిలో ఇతర పార్టీల నేతల చేరికలపై దృష్టి పెట్టాలి
- ఢిల్లీలో తెలంగాణ బీజేపీ ఎంపీలతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రత్యేక భేటీ
- తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతో పొత్తు ఉండదు: మీడియాతో బీజేపీ చీఫ్

2లో



# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు,

- మిగతా 2వ పేజీలో

# కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట వేయొచ్చు

- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడంపై సుదీర్ఘ చర్చ
- ఆదాయ పెంపు మార్గాలపై సీఎం, అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- సులభతర వాణిజ్యం మెరుగుపరిచేలా టెక్నాలజీ వినియోగించాలని సిఫార్సు
- బార్ అండ్ రెస్టారెంట్లలో విక్రయించే లిక్కర్‌పై వ్యాట్ విధించాలని సూచన
- వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడి



హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించడం ద్వారా ఖజానాకు మరింత ఊతం తీసుకురావచ్చని ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపర్చేందుకు ఏఐ ఆధారిత సమాచారంతో దవస్తు సేవల పన్ను (జీఎస్టీ) రాబడులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేలా సులభతర వ్యవస్థను తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

- మిగతా 2వ పేజీలో



# కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందనల

- కాంగ్రెస్ ప్రచారం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ ఆదరణ లభించిందని వ్యాఖ్య
- విద్యార్థుల సమస్యలను రాహుల్ గాంధీ ముందే ప్రస్తావించారని వెల్లడి
- ప్రజల నాడిని పట్టుకోవడంలో కాంగ్రెస్ వెనుకబడిందని అంగీకారం
- 2029 ఎన్నికల్లో జెన్-జీ ఓటర్లు అత్యంత కీలకం కానున్నారని వ్యాఖ్య



2లో

# హోంమంత్రి అనిత రాజీనామా చేయాలి

- దిశ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం
- అనిత డమ్మీ హోంమంత్రి అన్న వరుదు కల్యాణి
- జగన్ పై కక్షతోనే దిశ చట్టాన్ని రద్దు చేశారని ఆరోపణ



2లో

# నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి ఉన్నతస్థాయి సమీక్ష



# మీకు అండగా నేనుంటా..

- దేశ అభివృద్ధి కోసం మనమంతా కలిసికట్టుగా పని చేయాలి
- ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: పార్లమెంట్ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలుగుతుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సభలో నెలకొన్న గందరగోళం కారణంగా, ఇటీవల ఎన్నికైన ప్రతిభావంతులైన ఎంపీల మాటలను వినే అవకాశం దేశానికి దక్కలేదని పేర్కొన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎన్‌సీపీఐ), శివసేన, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే), రాష్ట్రీయ లోక్ మోర్చా, ఏఐఏడీఎంకే, యూపీపీఎల్ పార్టీలకు చెందిన 40 మందికి పైగా ఎంపీలతో శుక్రవారం జరిగిన అల్పాహార విందు సమావేశంలో మోదీ మాట్లాడారు. మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశమైన గైర్హాజరైన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబెల్ ఎంపీలు ఖలీలుర్ రెహ్మాన్, యూసుఫ్ పఠాన్,

- మిగతా 2వ పేజీలో

# మీకు అండగా నేనుంటా..

(మొదటి పేజీ తరువాయి)

అబూ తాహెర్ ఖాన్ ఈ విందు సమావేశంలో పాల్గొనడం విశేషం. కేంద్ర మంత్రి జేపీ నడ్డా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా లేదా కనీసం ఏడాది కాలంగా ఎన్డీయేతో కలిసి ఉన్నవారందరూ తన కుటుంబ సభ్యులేనని అన్నారు. దేశ అభివృద్ధి కోసం మనమంతా కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. అందరూ పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాల్గొనాలని, ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. ఎన్డీయే ఎంపీలందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. ప్రతి వారం ఆరోగ్య పరీక్ష చేయించుకోవాలని తెలిపారు.

**ఎన్డీయే అంటే ఒక కుటుంబం**

తూర్పు, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. అలాగే దేశ నిర్మాణంలో ఎంపీలు ఏ విధంగా సమర్థవంతంగా కృషి చేయవచ్చనే అంశంపై చర్చించారు. నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన అంశాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎంపీలకు తాను వెన్నుదన్నుగా నిలుస్తానని పేర్కొన్నారు. ఎన్డీయే అంటే ఒక కుటుంబమని పునరుద్ఘాటించారు. తమ భాగస్వామ్య పక్షాలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని వివరించారు. కేవలం ఎన్డీయే సభ్యులకే కాకుండా ప్రతి ఎంపీకీ మద్దతుగా నిలిచానని గుర్తుచేశారు. అల్పాహార విందుకు హాజరైనప్పటికీ తాను తాము ఎన్డీయేలో భాగస్వాములం కాదని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా నేత అబూ తాహెర్ వెల్లడించారు.

## హోంమంత్రి అనిత రాజీనామా చేయాలి: వరుదు కల్యాణి

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' చట్టం బిల్లును వెనక్కి తీసుకుంటూ కూటమి ప్రభుత్వం కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై వైసీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయంపై స్పందించిన వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి... హోంమంత్రి అనిత ఒక 'డమ్మీ' హోంమంత్రిగా మారారని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ, ఆమె తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ పై ఉన్న కక్షతోనే దిశ చట్టాన్ని రద్దు చేశారని ఆరోపించారు. మహిళలకు రక్షణగా నిలిచే దిశ చట్టాన్ని రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని కల్యాణి డిమాండ్ చేశారు. కావాలంటే చట్టం పేరు మార్చినా తమకు అభ్యంతరం లేదని, కానీ మహిళల రక్షణ కోసం ఆ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరారు.

## కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందనల

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల్లో అక్రమాలపై తమ పార్టీ నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన అంగీకరించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ, "సీజేపీ చేపట్టిన అంశాలనే మా పార్టీ, రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' ద్వారా కొన్నిరోజుల ముందే లేవనెత్తారు. కానీ ఆ ప్రచారానికి ఎందుకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదో మేం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల నాడిని మేము సరిగ్గా పట్టుకోవాలి" అని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లోని కోటాలో జూన్ 17న రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని ప్రారంభించగా, సీజేపీ నిరసనలు జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మొదలయ్యాయి. సీజేపీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విషయాన్ని శశిథరూర్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. 2029 నాటికి 'జెన్-జీ' అతిపెద్ద ఓటింగ్ వర్గంగా మారుతుందని, వారి ఆకాంక్షలను రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలని శశిథరూర్ సూచించారు. "వీధిలో చేయాల్సిన పోరాటం వీధిలో, సభలో చేయాల్సిన పోరాటం సభలో చేయాలి" అంటూ తమ పార్టీ వ్యూహంపై తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. ఐఐఎంయూఎన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరుకావడం, అదే వేదికపై శశిథరూర్ కూడా కనిపించడంపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారితో చర్చించవద్దని చెప్పడం సరికాదని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉంటూ తన స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి..



డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో వైసీపీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. విజయవాడ ఆటోనగర్‌లో జరిగిన ఈ దీక్షలో ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోసపోయిన డీఎస్సీ అభ్యర్థుల న్యాయం కోసం, నిరుద్యోగ యువత హక్కుల కోసం వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనుమతి తీసుకుని శాంతియుతంగా దీక్షలు చేస్తుంటే ఉదయాన్నే 100 మంది పోలీసులు వచ్చి టెంట్లు తీసేశారంటూ దేవినేని అవినాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదని... చంద్రబాబు, లోకేశ్ ల 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై కోడిగుడ్లు, టమాటాలు, యూరిన్ బాటిళ్లతో దాడులు చేయడం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు. దమ్ముంటే అక్రమాలపై సీబీఐ విచారణ వేయాలని, మూడేళ్ల తర్వాత టీడీపీ అధికారం కోల్పోవడం ఖాయమని హెచ్చరించిన ఆయన... నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రతి నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు.

# కృత్రిమ మేధతో జీఎస్టీ లోపాలకు అడ్డుకట్ట వేయొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శుక్రవారం సాయంత్రం అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జీఎస్టీ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించి ఆదాయ పెంపునకు ఉన్న మార్గాలు, ఇరు శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఏఐతో వ్యవస్థలను పటిష్ఠం చేసుకునే అంశాలపై అరవింద్ సుబ్రమణియన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అరవింద్ సుబ్రమణియన్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట వేసేందుకు, పన్ను లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని సూచించారు. రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మెరుగుపరిచేలా టెక్నాలజీని వినియోగించాలని వివరించారు. ప్రధానంగా భవన నిర్మాణ సామగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం అవసరమన్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలను, అందుకు అనుగుణంగా పన్నుల అంచనాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ జీఎస్టీలో ఏఐ వినియోగం ద్వారా వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా ఉండాలని సూచించారు. ఈ డేటాతోపాటు మీ--సేవ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను కూడా సమీకృతం చేయడం ద్వారా పరిపాలనకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ భేటీలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి.హెచ్. హరికిరణ్, ముఖ్య పౌరసంబంధాల అధికారి (సీపీఆర్వో) గుర్రం మల్సూర్ పాల్గొన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో భాగంగా ఎక్సైజ్ శాఖలో తీసుకురావాల్సిన కీలక సంస్కరణల గురించి అరవింద్ సుబ్రమణియన్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బార్ అండ్ రెస్టారెంట్లలో విక్రయించే లిక్కర్‌పై వ్యాట్ విధించాలని (తద్వారా బార్లలో విక్రయించే లిక్కర్ ధరలు పెరుగుతాయి), బార్లు పెట్టుకోవడానికి ఆసక్తి ఉన్న వారు, సరఫరాదారులు, అన్ని రకాల బ్రాండ్‌లు తెలంగాణ మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశించేలా నిబంధనల్లో మార్పులు తేవాలని సూచించారు. అలాగే లిక్కర్ ధరల నిర్ధారణ (పెంచడం లేదా తగ్గించడం) విధానం కూడా సులభతరంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు లిక్కర్ సరఫరాదారులకు చెల్లింపులు జరపాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌తో పోలిస్తే దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఎక్కువగా ఎక్సైజ్ ఆదాయం ఉంటోందని.. అయితే క్రమంగా ఇతర రాష్ట్రాల్లో ఇది పెరుగుతోందని చెప్పారు. అదే సమయంలో జీఎస్‌డీపీ, సొంత పన్నుల ఆదాయంతో పోలిస్తే ఎక్సైజ్ ఆదాయం క్రమంగా తెలంగాణలో తగ్గుతోందని సీఎం రేవంత్, అధికారులకు అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.



## మీరు చేస్తారా.. మేము ఎంటర్ కావాలా?

హైదరాబాద్: 'తెలంగాణలో పార్టీని అన్ని విధాలా ఎన్నికల యుద్ధానికి సిద్ధమయ్యేలా మీరు నడుం బిగిస్తారా? లేక మొత్తం మేమే కంట్రోల్‌లోకి తీసుకొని నడిపించాలా ? దీనిపై త్వరగా తేల్చుకొని స్పష్టమైన రోడ్‌మ్యా ప్, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోండి. లేనిపక్షంలో మా పద్ధతిలో పార్టీని ముందుకు నడిపిస్తాం'అని తెలంగాణ ముఖ్య నేతలకు బీజేపీ అధినాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు పార్టీవర్గాల సమాచారం. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షం బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదగాల్సిందేనని, అందుకు అవసరమైన అన్నిరకాల కార్యక్రమాలను చేపట్టాలని సూచించినట్టు తెలిసింది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో బీఆర్ఎస్ నేతలను చేర్చుకునేందుకు వెంటనే ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి అమలు చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయంలో ఎంపీలు ఏమాత్రం క్రియాశీలంగా వ్యవహరించకపోయినా, వెంటనే జాతీయ నాయకత్వం ఎంటరై తమ ప్రతినిధుల ద్వారా చేరికల వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకొస్తుందని హెచ్చరికలు జారీచేసినట్టు సమాచారం. మరోవైపు బుధవారం నుంచి నాలుగు రోజులుగా రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంట్లో వరుస సమావేశాలు జరిగాయి. ప్రతీ మూడునెలలకు ఒకసారి తెలంగాణకు వచ్చి రాష్ట్రంలో పార్టీ వాస్తవ పరిస్థితి ఏమిటి..వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం రాష్ట్ర పార్టీ నేతల వ్యూహాలు, చేస్తున్న కృషిని సమీక్షిస్తానని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేసినట్టు తెలిసింది. తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం, క్షేత్రస్థాయి పటిష్టత, రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన రాజకీయ కార్యాచరణపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. శు క్రవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎంపీలు డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, గోడెం నగేశ్‌లతో నితిన్ నబీన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలోని పార్టీ వ్యవహారాలు, ముఖ్య నేతల మధ్య నెలకొన్న వాతావరణం, సమన్వయం, పార్టీకి ఎదురవుతున్న సమస్యలు తదితరాలపై అభయ్‌పాటిల్ జాతీయపార్టీకి సవివరమైన నివేదిక సమర్పించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, వైఫల్యాలు, ప్రజల్లో వ్యతిరేకత, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉంది వంటి అంశాలపై రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మరో నివేదికను అందజేసినట్టు సమాచారం.

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

"చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం..

(మొదటి పేజీ తరువాయి)

రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

హైదరాబాద్: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి మంత్రి ఉత్తమ్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో ఈ మండళ్లు తప్పనిసరిగా సమావేశం కావాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భవిష్యత్ నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, ఆయకట్టు పరిస్థితులను సమీక్షించి ఏయే పంటలు వేయాలో రైతులకు శాస్త్రీయ సూచనలు ఇవ్వాలన్నారు. శనివారం నుంచే సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.



**వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే మేలు..**

నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను రైతులు సాగు చేయవద్దని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఒకసారి నీరు అందినా పంటల తర్వాతి దశలో నీరు అందించడంపై అనిశ్చితి నెలకొందని.. అందువల్ల ప్రతి ఆయకట్టులో ఎంత సాగునీరు అందించగలమో, ఎక్కడ నీటి పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, అధికారులు రైతులకు ముందే తెలియజేయాలని ఆదేశించారు. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయికి చేరుకోనందున ఆయా ఆయకట్టు ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

# పోచంపల్లిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

- సీనియర్ కళాకారులకు, రాష్ట్ర అవార్డు గ్రహీతలకు సన్మానం
- హాజరైన చేనేత జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ప్రసిద్ధ చేనేత క్షేత్రమైన పోచంపల్లిలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహాజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలలు వేసి చేనేత జెండాను ఆవిష్కరించారు. అనంతరం 'టై అండ్ డై' అసోసియేషన్ ఆధ్వర్యంలో రజతోత్సవ భవనంలో సీనియర్ చేనేత కళాకారులను ఘనంగా సత్కరించారు. పద్మనగర్ కాలనీలోని పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులతో కలిసి కంపెనీ సీఈఓ తడక రమేష్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని తిలకించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీతలు భోగ బాలయ్య దంపతులను సన్మానించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమానికి, రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో టై అండ్ డై సంఘం అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షుడు కుడికల రామ్ నరసింహ, ప్రధాన కార్యదర్శి ఈపూరి ముత్యాలు, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్, ఉపాధ్యక్షుడు భారత భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



## చెత్త వేరుచేసి సేకరిస్తేనే ఆదర్శ గ్రామం

- బోగారంలో నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై అవగాహన
- హాజరైన సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దే లక్ష్యంతో రామన్నపేట మండలం బోగారంలో శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్దేశించిన బుట్టల్లో వేయడం ప్రతీ ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వర్గీకరించడం ద్వారా పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణం, ప్రజారోగ్యం పరిరక్షించబడతాయని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి చెత్తబుట్టల వినియోగ విధానంపై గ్రామ ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు సభ్యులు నేరటి మానస సురేష్ యాదవ్, మేడి ఆంజనేయులు, కనుక మల్లేష్, చిరగోని శిల్పా, నవీన్ యాదవ్, వనం అండాలు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, సంఘబంధం అధ్యక్షురాలు పబ్బు జ్యోతి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదె హేమలత, వీవోఏ భోగ సంధ్య, గ్రామ పెద్దలు కూనూరు మహేష్ గౌడ్, బైకాని మహేష్ యాదవ్, మేడి కృష్ణ, మేడి ముఖేష్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చేనేత దినోత్సవ పోటీల్లో వలిగొండ విద్యార్థుల ప్రతిభ

- ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం
- హర్షం వ్యక్తం చేసిన హెచ్ఎమ్, ఉపాధ్యాయ బృందం




**తొలివెలుగు, వలిగొండ:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో వలిగొండ శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కుమారి బెలిదె అన్విత, తొమ్మిదో తరగతి విద్యార్థి బెలిదె వర్ధన్‌లు ఈ పోటీలలో రాణించి బహుమతులకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిలతో పాటు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థులు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు మంచి పేరు తెచ్చిన అన్విత, వర్ధన్‌లను ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్, ఉపాధ్యాయులు కొండపర్తి నవీన్, పోలేపాక నాగేందర్, సైదారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## నాయకత్వ లక్షణాలతోనే విద్యార్థుల సర్వాంగీణ వికాసం

- 'స్లేట్ ది స్కూల్'లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక
- ప్రమాణ స్వీకారం చేసిన నూతన విద్యార్థి క్యాబినెట్ సభ్యులు






**తొలివెలుగు, కర్మన్‌ఘాట్:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వైఖరిని పెంపొందించేందుకు కర్మన్‌ఘాట్‌లోని 'స్లేట్ ది స్కూల్' ప్రాంగణంలో శుక్రవారం ఇన్వెస్టిచర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన విద్యార్థి క్యాబినెట్ సభ్యులు విధి నిర్వహణకు కట్టుబడి ఉంటామని ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాజ్యలక్ష్మి, కుమారి కేనా పటేల్ నూతన క్యాబినెట్ సభ్యులను అభినందించారు. నిజాయితీ, సేవాభావం, బాధ్యతతో కూడిన నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సింపుల్ దయామా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు పాఠశాలలో ప్రత్యేకంగా 'త్రయోదసి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి తమ పాఠశాల అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈ వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మగ్గాల వర్క్ షెడ్డుకు నిధులు మంజూరు చేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు పల్లెర్ల చేనేత సంఘం వినతి
- హామీ ఇచ్చిన ప్రభుత్వ విప్

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని పల్లెర్ల చేనేత సహకార సంఘ భవనంలో మగ్గాల వర్క్ షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘ పాలకవర్గ సభ్యులు, చేనేత కళాకారులు శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. యాదాద్రి భువనగిరిలోని ఆయన నివాసంలో విప్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పల్లెర్ల చేనేత సంఘంలో వర్క్ షెడ్డు నిర్మాణానికి తగిన నిధులు మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వం చేనేత రంగాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి పని చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పొడుగు వెంకటేశం, ఉపాధ్యక్షుడు కందగట్ల వెంకటేశం, కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, కోశాధికారి సాయిని పురుషోత్తం, డైరెక్టర్లు గుర్రం మల్లేష్, వట్నాల వెంకటేష్, జంజీరాల సోమయ్య, ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు, రాపోలు శ్వేత వెంకటేష్, మాజీ డైరెక్టర్ గుర్రం వాసుదేవ్, సాయిని వెంకటేష్, గుర్రం నారాయణ, ఏలూరి సిద్దిరాములు, ఏలూరి లక్ష్మయ్య, పొడుగు సత్యనారాయణ, గుర్రం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువులకు అమృతధార

- అంతమ్మగూడెంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- పాల్గొన్న సర్పంచ్ గుమ్మి జంగారెడ్డి, పంచాయతీ సిబ్బంది




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** నవజాత శిశువుల సంపూర్ణ ఆరోగ్య రక్షణకు తల్లిపాలు అమృతధారలా తోడ్పడతాయని అంతమ్మగూడెం సర్పంచ్ గుమ్మి జంగారెడ్డి అన్నారు. మండలంలోని అంతమ్మగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోనే ముర్రిపాలు పట్టడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపం తలెత్తకుండా నిత్యం గుడ్లు, చేపలు, ఆకుకూరలు, పాలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు రావుల కవిత, రవి చందన, హెల్త్ సూపర్వైజర్లు వరలక్ష్మి, నీలమ్మ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, సంఘబంధం అధ్యక్షురాలు రావుల పావని తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల జీవన విధానంపై ఉపన్యాస పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న 50 మంది విద్యార్థులు
- విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 'సగటు చేనేత కార్మికుడి జీవన విధానం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుమారు 50 మంది వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని నేతన్నల జీవన శైలి, వారి కళా నైపుణ్యం, వస్త్ర తయారీలోని అద్భుతాల గురించి చక్కగా ప్రసంగించారు. పోటీల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వంటెద్దు బాలశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, సరస్వతి విద్యా మందిర్‌కు చెందిన సుంకి సిరిచందన ద్వితీయ, గౌతమి గ్రామర్ స్కూల్‌కు చెందిన గీతిక తృతీయ బహుమతి గెలుపొందారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. సాంప్రదాయ చేనేత కళను, కార్మికుల గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు అంకం మురళి, అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఏలే పాండు, రుద్ర చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి భోగ రమేష్, సహాయ కార్యదర్శి కుడికాల భాస్కర్, కోశాధికారి అంకం సాయి, గౌరవ సలహాదారులు రుద్ర శ్రీశైలం, కడవవేరు చంద్రశేఖర్, ఆడపు ఆంజనేయులు, సభ్యులు చింతకింది దామోదర్, సకినాల నాగయ్య, నక్క రామచంద్రం, బత్తుల కుమార్, రామేశ్వర, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన గొంగిడి సునీత

- కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- లింగరాజుపల్లిలో కుటుంబ సభ్యులకు పరామర్శ

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ 4వ వార్డు మెంబర్ కవాటి మల్లయ్య తండ్రి రాములు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీత మహేందర్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మనోధైర్యం కల్పించారు. ఆమె వెంట గ్రామానికి చెందిన సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎర్ర సోమిరెడ్డి, గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## తల్లిపాలతోనే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

- దుబ్బాకలో ఘనంగా వారోత్సవాలు
- 'డ్రైడే--ఫ్రైడే'తో పరిశుభ్రతపై అవగాహన

**తొలివెలుగు, రామన్నపేట:** శిశువుల శారీరక, మానసిక ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని దుబ్బాక గ్రామ సర్పంచ్ గట్టు నరసింహ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని దుబ్బాక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జననం నుంచి తొలి ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 'డ్రైడే--ఫ్రైడే' పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.



వీధుల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలించి వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప




సర్పంచ్ గుండాల రమేష్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఆరోగ్య సూపర్వైజర్ గోపాల్, అంగన్‌వాడీ కార్యకర్త గట్టు సరళ, ఏఎన్ఎం గౌఫియా, ఆశా కార్యకర్తలు లక్ష్మి, లత, వినోద, మంగమ్మ, రజిత, గణేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, తల్లులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతోనే పంచాయతీల అభివృద్ధి!





- రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నేత నకరికంటి మొగులయ్య ధ్వజం
- రామన్నపేట ఆసుపత్రిని 100 పడకలుగా విస్తరించాలని తీర్మానం

**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామ పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకరికంటి మొగులయ్య అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించకపోవడం శోచనీయమని విమర్శించారు. రామన్నపేట బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి నకరికంటి మొగులయ్యతో పాటు మండల ఇన్‌చార్జి కొరివి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలతోనే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో రామన్నపేట నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలని, రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, 24 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సుభాష్ సెంటర్ నుంచి నీర్నేముల వరకు రహదారి విస్తరణ చేపట్టి, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన బస్సు సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. సమావేశంలో నాయకులు వనం అంజయ్య, కట్ట యాదయ్య, ఏళ్ల సంజీవరెడ్డి, డోగుపర్తి సుభాష్, శానగొండ భిక్షమాచారి, జల లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, నల్ల మధుసూదన్‌రెడ్డి, మూడుదొడ్ల అనూష, మిర్యాల రాజ్‌కుమార్, కంభంపాటి శివరంజన్, బట్టే రమేష్, గజ్జల రాము, బాత్క నరేష్, రేపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట సమగ్ర అభివృద్ధే లక్ష్యం





- ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం
- మార్నింగ్ వాక్‌లో అభివృద్ధి పనుల పరిశీలన
- వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం ఉదయం పట్టణంలో విస్తృతంగా మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగుట్ట రోడ్డు, బీసీ కాలనీ, నల్లచెరువు, అంగడి బజార్, బాలికల వసతి గృహం, పెద్దమోరి తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష:**

నల్లచెరువు వద్ద జరుగుతున్న సౌందరీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే.. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాతగుట్ట రోడ్డులో హనుమాన్ ఆలయం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ, రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఆరా:**

బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన బీర్ల ఐలయ్య.. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యాదగిరిపల్లి, అంగడి బజార్ ప్రాంతాల్లో నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి అనువైన స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు.

**విద్యార్థినులతో కలిసి అల్పాహారం:**

బీసీ కాలనీలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఐలయ్య.. మంత్రి కొండా సురేఖ సూచనలు, యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు సహకారంతో అందజేసిన కుర్చీలు, ప్లేట్లు, నోట్‌బుక్స్‌ను విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేస్తూ ఆత్మీయంగా ముచ్చటించారు. వారికి స్వయంగా అల్పాహారం వడ్డించి, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**గౌడ వృత్తిదారులకు అండగా ఉంటాం:**

అనంతరం పాతగుట్ట వద్ద కల్లు కాంపౌండ్‌ను సందర్శించిన బీర్ల ఐలయ్య.. గౌడ వృత్తిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే తన ప్రధాన ప్రాధాన్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.





# పట్టపగలే దొంగల బీభత్సం.. రూ.5 లక్షలు అపహరణ

- వెంకటరమణ కాలనీలో కిరాణా వ్యాపారి ఇంట్లో చోరీ
- షాప్‌కు వెళ్లి వచ్చేసరికి తలుపులు పగలగొట్టి దొంగతనం
- రంగంలోకి దిగిన క్లూస్ టీమ్, పోలీసులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పట్టపగలే తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.5 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన భూదాన్ పోచంపల్లి పురపాలక పరిధిలోని వెంకటరమణ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన కిరాణా వ్యాపారి బోడ రమేష్ తన భార్యతో కలిసి శుక్రవారం ఉదయం 7:30 గంటలకు ఇల్లు తాళం వేసి మెయిన్ రోడ్డులోని షాప్‌నకు వెళ్లారు. సాయంత్రం 5:00 గంటలకు నీటి నల్లా కోసం ఇంటికి రాగా, తలుపుల తాళం రాడ్‌తో పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాను పగలగొట్టి, కిరాణా సరుకుల ఖరీదు కోసం దాచుకున్న రూ.5 లక్షల నగదును దుండగులు దోచుకెళ్లినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. పట్టపగలే చోరీ జరగడంతో శివారు కాలనీల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీల్లో పోలీసుల నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. గుండంరాజుపల్లిలో మెగా వైద్య శిబిరం

- 150 మందికి పైగా వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ
- కృషి చేసిన సర్పంచ్ కమలాకర్‌కు గ్రామస్థుల అభినందనలు



**తొలివెలుగు, చిన్నగూడూరు:** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామంలో మెగా మ్యాట్రిక్స్ హాస్పిటల్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. చందర్ (ఎంబీబీఎస్, ఎండీ) రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ శిబిరంలో గ్రామస్థులకు బీపీ, షుగర్, జ్వరం తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామంలో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేసిన గ్రామ సర్పంచ్ గునిగంటి కమలాకర్‌కు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల పాత్ర కీలకం

- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ
- శాకంబరి సేవా సమితిని అభినందించిన సర్పంచ్ చిలువేరు లక్ష్మయ్య

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో, పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో దాతల ఉదారత, సహకారం ఎంతో కీలకమని సర్పంచ్ చిలువేరు లక్ష్మయ్య అన్నారు. మండలంలోని మెహర్‌నగర్ గ్రామంలో శుక్రవారం శాకంబరి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ లక్ష్మయ్య.. సంస్థ ప్రతినిధులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కారీ బడుల్లో చదువుతున్న విద్యార్థుల విద్యకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగట్టి రాజీరెడ్డి, ఉపసర్పంచ్ కేసారం పూజ సంపత్ రెడ్డి, వార్డు సభ్యులు బూరుగు వెంకటేష్ గౌడ్, శాకంబరి సేవా సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# బడిపై మమకారం.. దాత ఉదారత

- విద్యార్థినులకు క్రీడా దుస్తులు బహుకరించిన పూర్వ విద్యార్థి
- రాజాపేట జెడ్పీ స్కూల్‌లో దాత చింతం రాజేశ్వర్‌కు ఘన సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులను ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ కోయ మధు, ఎంఈఓ చందా రమేష్ అన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థినులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. 1992-93 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థి, దాత చింతం రాజేశ్వర్ స్వయంగా పాల్గొని విద్యార్థినులకు క్రీడా దుస్తులను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రజాప్రతినిధులు దాతను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినులు రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేలాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్, ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, మాజీ సర్పంచ్ అంకతి బాలయ్య, నాయకులు ఆడెపు శ్రీశైలం, బెజుగం వినయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీత సుధాకర్‌కు 'కొండ లక్ష్మణ్ బాపూజీ' పురస్కారం

- చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి తుమ్మల చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- 210 కోయలతో రూపొందించిన ఫారెస్ట్ థీమ్ వస్త్రానికి గుర్తింపు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రానికి చెందిన మాస్టర్ వీవర్ సీత సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'కొండ లక్ష్మణ్ బాపూజీ' అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన చేనేత దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. స్పెషల్ డిజైన్ విభాగంలో 210 కోయలతో 'ఫారెస్ట్ థీమ్'తో రూపొందించిన చేనేత వస్త్రానికి గాను సుధాకర్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత జౌళి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, స్పెషల్ సెక్రటరీ కాత్యాయనిలు సుధాకర్‌కు అవార్డుతో పాటు రూ.25,000 నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఈ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని వినూత్న డిజైన్లతో చేనేత వస్త్రాలను రూపొందించి అవార్డులు సాధించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



# సాగర్ తీరంలో 'వరుణ యాగం'

- ఆగస్టు 10న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- ముహూర్తం ఖరారు చేసిన యాదాద్రి వేద పండితులు
- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో నిర్వహణ.. పూర్ణాహుతికి సీఎం రేవంత్‌రెడ్డి

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తేదీన నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో ఈ యాగాన్ని ఘనంగా చేపడుతున్నారు. యాగానికి సంబంధించి శుక్రవారం యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి ముహూర్తాన్ని ఖరారు చేశారు. కృష్ణా, గోదావరి నదులతో పాటు చెరువులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని యాదాద్రి అర్చకులు యాగ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఈ వరుణ యాగం జరుగుతుంది. సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి రాజశ్యామల, వరుణ యాగ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పించనున్నారు.

# ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు




**తొలివెలుగు, వలిగొండ:** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకుడు బత్తిని నాగేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు వద్ద భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రజలకు, పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేష్ గౌడ్ మాట్లాడుతూ.. యువ నాయకురాలు కీర్తి రెడ్డి నియోజకవర్గ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో రాజకీయాల్లో మరింత రాణించి ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడ బత్తిని సహదేవ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, వలిగొండ ఉపసర్పంచ్ మలుగ మాధవి-వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, నాయకులు పలుసం సతీష్ గౌడ్, కొండూరు భాస్కర్ గౌడ్, గంగాపురం సతీష్ గౌడ్, సామ రామ్ రెడ్డి, గంగదారి రాములు, బత్తిని లింగయ్య గౌడ్, పబ్బు సురేందర్ గౌడ్, కాసుల వెంకన్న, కొండూరు సాయి, ఎమ్మె లింగస్వామి, రాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గాయత్రి పాఠశాలలో అలరించిన బోనాల వేడుకలు

- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు: ప్రిన్సిపాల్ అనురాధ
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న విద్యార్థినులు



**తొలివెలుగు, వలిగొండ:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని వలిగొండ పట్టణంలోని గాయత్రి హైస్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో బోనాల వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గ్రామదేవతలైన మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్లకు సమర్పించే కృతజ్ఞతా పూజే బోనాలని తెలిపారు. సంస్కృత పదమైన 'భోజనం' నుంచే 'బోనం' అనే పదం వచ్చిందని వివరించారు. కొత్త మట్టి లేదా రాగి కుండలో అన్నం, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి అమ్మవారికి సమర్పించడం మన ఆచారమని చెప్పారు. పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# భీమలింగం కాలువకు 'డెక్క' విముక్తి

- సొంత నిధులతో పనులు చేపట్టిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న దిగువ ప్రాంత రైతులు



**తొలివెలుగు, వలిగొండ:** భీమలింగం కాలువలో గుర్రపు డెక్క ఆకు పేరుకుపోయి సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఊరటనిచ్చారు. తన సొంత నిధులతో హిటాచి యంత్రాల ద్వారా కాలువలోని గుర్రపు డెక్కను తొలగించే పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. వలిగొండ చెరువు నుంచి ప్రారంభమై మల్లెపల్లి, వెలవర్తి, మొగిలిపాక మీదుగా ముద్దపురం వరకు కాలువలో విస్తరించిన ఆకును తొలగించే కార్యక్రమాన్ని వలిగొండ చెరువు వద్ద ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కాలువలో గుర్రపు డెక్క కారణంగా దిగువ ప్రాంత రైతులకు నీరు అందడం లేదని, పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి హామీ నెరవేర్చారు. డెక్క తొలగింపుతో దిగువ ప్రాంతాల్లోని బీడు భూములకు సాగునీరు అంది సస్యశ్యామలం కానుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, కంచనపల్లి, ముద్దాపురం గ్రామాల సర్పంచులు, నాయకులు బత్తిని లింగయ్య గౌడ్, పబ్బు సురేందర్ గౌడ్, పల్సం సతీష్ గౌడ్, రేసు బుచ్చిరెడ్డి, సామ రామ్ రెడ్డి, కాసుల వెంకన్న గౌడ్, గంగాపురం సతీష్ గౌడ్, కొండూరు సాయి, చిలుకూరు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే పరమావధిగా.. ఆపదలో అండగా బీర్ల అనిత





- బీర్ల ఫౌండేషన్ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు
- నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత.. విద్యార్థులకు ఉన్నత విద్యకు సహకారం
- ఉచిత అంబులెన్స్ సేవలతో ఆపదలో ఉన్న వారికి భరోసా

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత సేవలను పలువురు గుర్తుచేసుకుంటున్నారు. ఆమె జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలపై ' తొలివెలుగు ' ప్రత్యేక కథనం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణిగా, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం బీర్ల అనిత ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ తనవంతు సహాయాన్ని అందిస్తున్నారు.

**ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక చేయూత:**

కుటుంబ సభ్యులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాధిత కుటుంబాల తక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం వంటి నిత్యావసరాలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పేదింటి ఆడబిడ్డల వివాహాలకు సాయం:**

ఆర్థిక స్తోమత లేక కుమార్తెల వివాహాలను నిర్వహించలేని నిరుపేద కుటుంబాలకు సైతం బీర్ల అనిత సహకరిస్తున్నట్లు తెలిపారు. వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తూ ఆయా కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ఫౌండేషన్ వర్గాలు పేర్కొన్నాయి.

**అత్యవసర వేళ ఉచిత అంబులెన్స్ సేవలు:**

అత్యవసర వైద్య పరిస్థితుల్లో పేదలకు అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా ఫౌండేషన్ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమయానికి ఆసుపత్రికి చేరుకోవాల్సిన వారికి ఉచిత అంబులెన్స్ సేవలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

**విద్యార్థులకు ఉన్నత విద్యకు ప్రోత్సాహం:**

పేదరికం కారణంగా ఉన్నత చదువులు కొనసాగించలేని విద్యార్థులకు సైతం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమయ్యే పరిస్థితి రాకుండా అవసరమైన సహకారం అందిస్తున్నారని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు:**

అనారోగ్యం, కుటుంబంలో విషాదం, ఆర్థిక ఇబ్బందులు, విద్య, వివాహం తదితర సందర్భాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించడమే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీర్ల ఐలయ్య చేపడుతున్న ప్రజా సేవా కార్యక్రమాలకు తోడుగా బీర్ల అనిత ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా తనవంతు బాధ్యతను నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, మరింత కాలం ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.

# యాదాద్రిలో అమ్మవారికి ఉంజల్ సేవ


- అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు
- కన్నులపండువగా ముత్యాల పల్లకీ సేవ




**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిత్య పూజలతో పాటు సంప్రదాయ పర్వాలను శాస్త్రోక్తంగా జరిపారు. గర్భాలయంలో స్వయంభూ స్వామివారికి ఆస్థాన పూజలు నిర్వహించిన అనంతరం, సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారిని వజ్ర వైడూర్యాలు, సుగంధ పుష్పాలతో దివ్యంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని ముత్యాల పల్లకిపై అద్దాల మండపానికి వేంచేపు చేసి ఉంజల్ సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక హారతులు నివేదించగా, ఆస్థాన విద్వాంసుల సన్నాయి రాగాలు, డోలు వాయిద్యాలు, మేళతాళాల మంగళ ధ్వనుల నడుమ సంకీర్తనలు ఆలపించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# భర్త హత్యకు భార్య కుట్ర!

- ప్రియుడితో వాట్సాప్ చాటింగ్ ఆధారాలతో బయటపడిన దారుణం
- బాధితుడి ఫిర్యాదుతో డోర్నకల్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్
- కేసు ఖమ్మం పోలీస్ స్టేషన్‌కు బదిలీ






**తొలివెలుగు, డోర్నకల్:** వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే మట్టుబెట్టేందుకు భార్య, ఆమె ప్రియుడు కుట్ర పన్నిన ఘటన డోర్నకల్ మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత పదేళ్లుగా ఈ కుటుంబం ఖమ్మంలో నివాసముంటోంది. కాగా, భవానికి సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు రాజేశ్వరరావు గుర్తించాడు. జూలై 27న పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. అనంతరం బాధితుడు తన సోదరుడిని తీసుకురావడానికి వెళ్తుండగా సైదులు అతడిని వెంబడించాడు. అనుమానంతో ఇంటికి వచ్చి భార్య ఫోన్ పరిశీలించగా.. "నా భర్తను ఎలాగైనా చంపు, లేదంటే నేను చనిపోతా" అని సైదులుకు భవాని పంపిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్‌లు బయటపడ్డాయి. దీంతో స్క్రీన్ షాట్లతో రాజేశ్వరరావు డోర్నకల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనలు ఖమ్మం పోలీస్ స్టేషన్ పరిధిలో జరగడంతో పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం కేసును ఖమ్మం బదిలీ చేశారు.

# పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహుకరణ

- బెజుగం రాధికా-రాజేశ్వర్ దంపతుల ఉదారత
- దాతలను సత్కరించిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

**తొలివెలుగు, రాజాపేట:** పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ చందా రమేష్ అన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు శుక్రవారం బెజుగం రాధికా-రాజేశ్వర్ దంపతులు సౌండ్ సిస్టమ్‌ను బహుకరించారు. పాఠశాల 1992-93 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థి, మాజీ ఉపసర్పంచ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెజుగం రాజేశ్వర్ పాఠశాల అవసరాల నిమిత్తం సౌండ్ స్పీకర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు దాత దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో సాంస్కృతిక, విద్యా సంబంధిత కార్యక్రమాల నిర్వహణకు ఈ సౌండ్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోయ మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, మాజీ సర్పంచ్ అంకతి బాలయ్య, నాయకులు బెజుగం వినయ్, చింతం రాజేశ్వర్, ఆడెపు శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# చేనేత కళాకారులకు బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం

- పతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి: జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**తొలివెలుగు, రాజాపేట:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. పార్టీ బూత్ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు బిర్రు సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. నేతన్నల నైపుణ్యాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చేనేత రంగానికి పూర్వవైభవం రావాలంటే ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ధరించాలని పిలుపునిచ్చారు. అనంతరం చేనేత కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కాయితి బాలిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మెందు భగవాన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాధనబోయిన శంకర్, నాయకులు పొన్న సంపత్, చిగుల్లా బీరయ్య, బూర్గు శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ బోడిగే కరుణాకర్, పులిగిల్ల నరసింహులు, రేగొండ మాధవులు, బల్ల కృష్ణ, బిళ్ళ ప్రభు, బిర్రు బాలకృష్ణ, నక్క మాధవులు, పెంట హరికృష్ణ, గడ్డం కృష్ణ, బొడ్డు లక్ష్మణ్, పొన్న సంతోష్, బెజిగం శ్రీను, నాగపురి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బొందుగుల అభివృద్ధికి నిధుల మంజూరు

- పది రోజుల్లో సీసీ రోడ్లు, మహిళా భవనం మంజూరు చేస్తాం
- జనవరి నాటికి బొందుగుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి మరో పది రోజుల్లో సీసీ రోడ్లు, మహిళా సంఘ భవనం మంజూరు చేయిస్తానని, వచ్చే ఏడాది జనవరి నాటికి గ్రామంలోని సమస్యలన్నింటినీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం బొందుగుల గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే ఐలయ్యను కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బొందుగుల గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం గ్రామ పాలకవర్గ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ అబ్దుల్ అబిద్, వార్డు సభ్యులు ముక్క శ్రీధర్, రాజ్యం అనిత, బాలకిషన్, శీలం గాలిమ్మ, గ్రామస్థులు అశోక్, రాములు, మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఆసరా

- 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ
- పరామర్శించిన ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బీర్ల అనిత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట గ్రామానికి చెందిన ఇటీవల మృతిచెందిన ఎర్రగోకుల లలిత, దండే నవీన్ కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సాయం అందించారు. శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించిన బీర్ల ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బీర్ల అనిత, ప్రతి కుటుంబానికి 50 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నెమిలే మహేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పిండికూర మహేష్, మాజీ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, ఉపసర్పంచ్ నెమిలే కేదారి గౌడ్, నాయకులు రేగు సిద్దులు, చింతల కోటయ్య, డాక్టర్ చింతల రవి, పొట్టబత్తిని వెంకటేష్, గుర్రం రూపేష్, గుర్రం శ్రావణ్, కాకళ్ళ మల్లేష్, సట్టు సిద్దులు, గోల్లెన ప్రశాంత్, గౌటె భాను, చుంచు నారాయణ, కొత్త ఉమేష్, గోలనుకొండ బిక్షపతి, కుతాటి నరేష్, ఎండీ అక్రమ్, సిరిపంగ కర్ణాకర్, కసోజు బ్రహ్మం, ఎండీ జునీద్, దోమల బాలపోశయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి బీజేపీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

- మృతుడు గొల్లూరి నర్సయ్య కుటుంబానికి రూ. 5,000 అందజేత
- పరామర్శించిన బీజేపీ నాయకులు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, 9వ వార్డు వార్డు మెంబర్ అభ్యర్థి గొల్లూరి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. నర్సయ్య దశదిన కర్మ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన బీజేపీ నాయకులు, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గ్రామ పార్టీ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు ముత్యం రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పుట్ట వీరయ్య, మండల ఉపాధ్యక్షుడు చామపురం శ్రీశైలం, రాజం నగేష్, బండ ఆంజనేయులు, బాల్ద కనకయ్య, అమరాజు శ్రీనివాస్, కోనేటి శ్రీరామ్, అమరా సిద్ధులు, అమరాజు నరసింహులు, గొల్లూరి జయరాజు, కృష్ణ, గొల్లూరి రామయ్య, గొల్లూరి స్వామి, స్థానిక గ్రామ పెద్దలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పిండికూర మహేష్



- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: మహేష్

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పిండికూర మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాజాపేటలోని స్థానిక అతిథి గృహంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, పీఏసీఎస్ ఛైర్మన్ నెమిలే మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు పిండికూర మహేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులకు నాయకులు నియామక పత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పార్టీకి విశిష్ట సేవలందించిన మాజీ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్‌ను కూడా నాయకులు సన్మానించారు. నూతన కార్యవర్గం: ఉపాధ్యక్షులుగా ఆకిరెడ్డి రమేష్, పుల్లంగారి పోచయ్య, ప్రధాన కార్యదర్శులుగా కాకల్ల పెద్ద మల్లేష్, సిరిపంగ కర్ణాకర్ (శంకర్), కొత్త కనకయ్య, కార్యదర్శులుగా కాసోజు బ్రహ్మం, పొట్టబత్తిని భద్రయ్య, ఆకిరెడ్డి ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పిండికూర మహేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నెమిలే కేదారి గౌడ్, మేడిశెట్టి సురేష్, డాక్టర్ చింతల రవి, రేగు సిద్దులు, సట్టు సిద్ధులు, గొలనుకొండ బిక్షపతి పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి అమృతం





- ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టాలి
- లింగోజిగూడెంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- సంపూర్ణ పోషకాలతోనే వ్యాధి నిరోధక శక్తి పెంపు
- 3వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** తల్లిపాలే నవజాత శిశువుకు తొలి అమృతమని, బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని చౌటుప్పల్ మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం 3వ వార్డు పరిధిలోని లింగోజిగూడెం అంగన్‌వాడీ కేంద్రం-2లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ లావణ్య మాట్లాడుతూ.. ప్రతి తల్లి తన బిడ్డ జన్మించిన నాటి నుంచి కనీసం ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాల ద్వారా శిశువులకు సంపూర్ణ పోషకాహారం లభించడమే కాకుండా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# సీపీఐ ప్రచార జాతాను జయప్రదం చేయండి

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు
- ఈ నెల 9న చౌటుప్పల్‌కు ప్రచార జాతా: పల్లె శేఖర్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 6 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న సీపీఐ ప్రచార జాతాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ప్రచార జాతా సాగుతోందన్నారు. ఈనెల 9న (ఆదివారం) ఈ జాతా చౌటుప్పల్ పట్టణానికి చేరుకోనున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, నాయకులు బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య, టంగుటూరి రాములు, రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య, నీల బిక్షపతి పాల్గొన్నారు.




# నూతన జూనియర్ సివిల్ జడ్జిని కలిసిన ప్రభుత్వ న్యాయవాది

జడ్జి శాలినికి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపిన వాకిటి నర్సింహా రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టుకు నూతనంగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జి శాలినిని ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహా రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జడ్జి శాలినికి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని న్యాయపరమైన అంశాలు, న్యాయవాదుల విధులు తదితర విషయాలపై కొద్దిసేపు చర్చించారు. నూతన జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన శాలినికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాదితో పాటు న్యాయవాదులు పాల పరమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ అగ్గి రాజేసిందెవరు.. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ప్రమాదంపై ఎన్నో అనుమానాలు

రాష్ట్రంలో నేరాలపై పోలీసులు జరిపే పరిశోధనకు గుండెకాయ లాంటి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో అగ్ని ప్రమాదం జరిగి నేటికి 6 నెలలు పూర్తయింది. ఆ ప్రమాదంలో కొన్ని వేల ఫైళ్లు, ఎన్నో కేసులకు చెందిన ఆధారాలు బూడిదయ్యాయని ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖాగోయెల్ వెల్లడించారు. కానీ, అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న ఎఫ్ఎస్ఎల్‌లో అగ్గి రాజేసిందెవరో పోలీసులు నేటికీ తేల్చలేకపోయారు. ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం జరిగిన మరుసటి రోజే మీడియాతో మాట్లాడిన పోలీస్ ఉన్నతాధికారులు.. ఆ ప్రమాదానికి కారణాలేమిటో అన్వేషిస్తామని చెప్పారు. కానీ, ఆ ప్రమాదం ఎందుకు జరిగిందో నేటికీ చెప్పలేకపోయారు. అగ్నిప్రమాదం జరిగిన రోజే ఫైర్ డీజీ సహా పలువురు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత నాగ్‌పూర్‌కు చెందిన ఫైర్ ఫోరెన్సిక్ నిపుణులను తీసుకొచ్చి ప్రమాద కారణాలను విశ్లేషించడంతోపాటు డాటాను రిట్రైవ్ చేసేందుకు ప్రయత్నించారు. ఎఫ్ఎస్ఎల్‌లో కాలిపోయిన గదులకు అధికారులు ఇటీవల రంగులు వేయించి, మళ్లీ విధులు నిర్వర్తిస్తున్నారు.

# తల్లిపాలు.. రోగ నిరోధక 'సిరి'



- పుట్టిన గంటలోనే ముర్రుపాలు పట్టించాలి
- అల్లాపురంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన సర్పంచ్ మంజుల

**తొలివెలుగు, చౌటుప్పల్:** తల్లిపాలల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, ప్రసవమైన గంటలోనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి సూచించారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. బిడ్డ పుట్టిన తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, దీనివల్ల తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటుందన్నారు. ఆరు నెలలు దాటిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే గుడ్లు, పాలు, పప్పన్నం, ఆకుకూరలు, అమృత ఆహారం వంటి పోషకాహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా ఉచిత యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుమిత్ర పెద్దిరెడ్డి, భూతం లింగస్వామి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త అమృత, ఆశా వర్కర్ దివ్యశ్రీ, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.





## ట్రినిటీ హైస్కూల్‌లో బోనాల సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాలు ప్రతీక: ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో శుక్రవారం బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి ఏటా పండుగ ఉత్సవాలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. పాఠశాలల్లో ఇలాంటి సంస్కృతీ సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలకు మన ఆచార వ్యవహారాలపై అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, అలంకరించిన బోనాలతో నిర్వహించిన ప్రదర్శన అలరించింది. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, సమన్వయకర్తలు భార్గవి, స్వరూప, పూజా రెడ్డి, ఉపాధ్యాయులు కరుణ, మౌనిక, జ్యోతి, అరుణ, స్వరూప, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రహదారిపై గుంత పూడ్చిన పీసీఆర్ ఫౌండేషన్

- వాహనదారుల కష్టాలు తీర్చిన సభ్యులు
- అధికారులు పట్టించుకోకపోవడంతో చొరవ
- పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్

**తొలివెలుగు, జన్నారం:** జన్నారం మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతతో వాహనదారులు, పాదచారులు పడుతున్న అవస్థలను గుర్తించి పీసీఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ సభ్యులు శ్రమదానం చేశారు. శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ గుంతను కంకర, మట్టితో పూడ్చివేసి రాకపోకలను పునరుద్ధరించారు. గుంత వల్ల ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో తామే చొరవ తీసుకున్నట్లు పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, కొత్త శీను గుప్తా, నల్లతీగల విష్ణు, రవి, కొమురవెల్లి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



- చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో పతాకావిష్కరణ
- హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చౌటుప్పల్ చేనేత సహకార సంఘం భవనం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9:05 గంటలకు సహకార సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్ బాబు ఆవరణలో సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా చౌటుప్పల్ పురపాలక సంఘ చైర్‌పర్సన్ ముగుదాల పావని రమేష్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ట్రస్ట్ చైర్మన్ బడుగు లక్ష్మయ్య, జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గుర్రం నరసింహ హాజరయ్యారు. చేనేత రంగాన్ని కాపాడుకోవాలని, నేతన్నల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా ప్రముఖులు ఆకాంక్షించారు. ?ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు గోశిక శ్రీకాంత్, కార్యదర్శి కాటబత్తిని భీమయ్య, కోశాధికారి బడుగు సావిత్రి, కార్యవర్గ సభ్యులు, పలువురు చేనేత ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

## టాటా నెక్సాన్ కొత్త ఎడిషన్ లాంచ్: ధర ఎంతంటే?

భారతదేశంలో అత్యధిక అమ్మకాలు పొందుతున్న నెక్సాన్.. 'కామో ఎడిషన్' రూపంలో లాంచ్ అయింది. దీని ధర రూ.9.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). దీనికి కంపెనీ పరిమిత సంఖ్యలో మాత్రమే విక్రయించనుంది. భారతదేశంలో నెక్సాన్ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని, 11 లక్షలకు పైగా అమ్మకాలను సాధించిన సందర్భంగా.. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీని టాటా మోటార్స్ లాంచ్ చేసింది. అయితే ఇందులో ఎలాంటి మెకానికల్ మార్పులు లేదు, కానీ కొన్ని కాస్మెటిక్ అప్‌డేట్‌లు కొన్ని అదనపు పరికరాలను జోడించారు. నెక్సాన్ కామో ఎడిషన్ మున్నార్ మిస్ట్, కూర్గ్ క్లౌడ్ అనే రెండు కొత్త రంగుల్లో లభిస్తుంది. ఈ రంగులు కాకుండా కామో బ్యాడ్జ్‌లు కనిపిస్తాయి. క్యాబిన్‌లో కూడా ముందు సీట్ల హెడ్‌రెస్ట్‌లపై కామో థీమ్ ఉంటుంది. క్యాబిన్ లోపల 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో కూడిన కొత్త 12.3-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అందించారు. మరో ముఖ్యమైన ఫీచర్ ఏమిటంటే.. ఈ కారులోని నాలుగు సరౌండ్-వ్యూ కెమెరాలను ఉపయోగించి పనిచేసే ఇంటిగ్రేటెడ్ డాష్‌క్యామ్. ఇది నిరంతరంగా రికార్డ్ చేయగలదు, ప్రమాదం జరిగినప్పుడు ఫుటేజీని ఆటోమేటిక్‌గా సేవ్ చేస్తుంది, వీడియోలను ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై చూడటానికి లేదా స్మార్ట్‌ఫోన్‌కు బదిలీ చేయడానికి అనుమతిస్తుంది. వేరియంట్‌ను బట్టి.. పరికరాల జాబితాలో పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, బ్లైండ్ వ్యూ మానిటర్‌తో కూడిన 360-డిగ్రీ కెమెరా, జేబీఎల్ స్పీకర్ ఆడియో సిస్టమ్, వైర్‌లెస్ ఛార్జర్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ మొదలైనవి ఉన్నాయి. ఏడు ఫంక్షన్లతో కూడిన ఏడీఏఎస్ మాత్రమే కాకుండా.. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం కూడా ఉన్నాయి. నెక్సాన్ కామో ఎడిషన్.. స్టాండర్డ్ మోడల్‌లో ఉన్న అవే ఇంజన్ ఆప్షన్‌లతో కొనసాగుతుంది.




కొనుగోలుదారులు 1.2-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్, 1.5-లీటర్ డీజిల్, 1.2-లీటర్ టర్బో సీఎన్జీ యూనిట్ వంటి వాటిలో ఎంచుకోవచ్చు. వేరియంట్‌ను బట్టి, ట్రాన్స్‌మిషన్ ఆప్షన్‌లలో మాన్యువల్, ఆటోమాటిక్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు ఉన్నాయి.




# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.



# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్

## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

# టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.





# నా జీవితాన్ని ఒక్కరి కోసం మార్చుకోలేను..

ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' (ఇూహీఇూ) సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు అని ఆమె సమాధానం ఇచ్చారు. అమీషా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె అభిప్రాయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతూ.. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి అనేది పరస్పర అవగాహన, ప్రేమ, సహజీవనానికి ప్రతీక అని అభిప్రాయపడుతున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో అమీషా పటేల్ తన ప్రేమ జీవితం గురించి కూడా మాట్లాడారు. సినీ రంగంలోకి రావడం తన అప్పటి ప్రియుడికి ఇష్టం లేకపోవడంతో ఆ బంధం ముగిసిందని ఆమె వెల్లడించారు. ఆ అనుభవం తన జీవితంలో చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. అలాగే, తన కెరీర్‌ను అర్థం చేసుకుని ప్రోత్సహించే వ్యక్తి దొరికితే పెళ్లి గురించి ఆలోచించేవారినని, కానీ అలాంటి మానసిక పరిణతి ఉన్న భాగస్వామిని కనుగొనడం సులభం కాదని పేర్కొన్నారు. వయసు కంటే వ్యక్తిత్వం, ఆలోచనా విధానమే ముఖ్యమని కూడా ఆమె అభిప్రాయపడ్డారు.అమీషా పటేల్ ఇటీవల సన్నీ డియోల్ సరసన నటించిన 'గదర్ 2' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు. సకీనా పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. అనంతరం 'తౌబా తేరా జల్వా' చిత్రంలో కనిపించిన అమీషా, ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు.

# సెకండ్ ఇన్నింగ్స్ పై రాజశేఖర్ ఏమన్నారంటే...!

సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను ఉత్సాహంగా ప్రారంభించారు. కథాబలం ఉంటే హీరో పాత్రలే కాదు, సహాయ నటుడిగా కనిపించడానికీ తాను సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో తన పాత్రకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణ పట్ల రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కథకు ప్రాధాన్యమున్న పాత్రలు వస్తే చేయడానికి వెనుకాడనని తెలిపారు. నటుడు ఎప్పుడూ నటుడే. మంచి పాత్ర దొరికితే తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంటాడు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటినా ఇప్పటికీ యంగ్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపించడం వెనుక ఉన్న రహస్యాన్ని కూడా రాజశేఖర్ పంచుకున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలే తన ఫిట్‌నెస్‌కు కారణమని చెప్పారు. ముఖ్యంగా పుచ్చకాయ, ఆపిల్, ఆరెంజ్ పండ్ల రసాల మిశ్రమాన్ని ప్రతిరోజూ తీసుకుంటానని, దీనితో పాటు క్రమం తప్పని వ్యాయామం తనలో శక్తిని నింపుతుందని వివరించారు. ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో తన భార్య జీవిత పాత్ర ఎంతో కీలకమని రాజశేఖర్ తెలిపారు. కెరీర్‌లోని ఒడిదొడుకులను అధిగమించడంలో ఒకరికొకరు అర్థం చేసుకుని అండగా నిలవడమే తమ బంధంలోని బలమని ఆయన పేర్కొన్నారు.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com